మహబూబ్‌నగర్



వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట


# క్రీడల్లో భాగస్వాములై రాణించాలి

**అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్.ఖీమ్యా నాయక్**

**వనపర్తి, మే 16, ప్రభాతవార్త:** ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా మే, 11 నుండి 17 వరకు నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో భాగంగా శనివారం ఐడిఒసి సమావేశ మందిరంలో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో కళలు, హస్తకళలు, సాంస్కృతిక దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు వివిధ కళలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని రాణించాలని సూచించారు. ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు బాగున్నాయని, అర్హులైన ఉత్తమ ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనలు చేస్తున్నారని దానితోపాటు విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఇస్తున్నారని తెలియజేశారు. చదువుకున్న వారు ఒక్క ఉద్యోగమే కాకుండా ఏ రంగంలోనైనా రాణించగలరని వివరించారు. అనంతరం విద్యార్థులు స్వయంగా రూపొందించిన చిత్రకళలు, హస్త కళల ప్రదర్శనను అదనపు కలెక్టర్ సందర్శించి ఉత్తమ కళలు రూపొందించిన విద్యార్థులకు, చిత్రకళలు, నాట్యం చేసిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.



పీఎంశ్రీ పాఠశాల విద్యార్థినులు, ఇతర ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, బాల భవన్ విద్యార్థులు నిరుపయోగ వస్తువులతో తయారు చేసిన హస్త కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు చూపరులను ఎంతో ఆకట్టుకున్నాయి. జిల్లా విద్యా శాఖ అధికారి మహమ్మద్ ఘని, యంఈ ఒలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అకాల వర్షం



జడ్చర్ల మార్కెట్‌లో తడిసిన ధాన్యం

**విరిగిన చెట్లు..కూలిన ఇండ్లు..**

**జడ్చర్ల మార్కెట్‌లో తడిసిన ధాన్యం**

**ఆందోళనలో అన్నదాతలు**

**మహబూబ్నగర్/ జడ్చర్ల మే 16 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ జిల్లాలో పలుచోట్ల అకాల వర్షం కురిసింది. శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో పలుచోట్ల చెట్లు నేలకు ఒరిగాయి. జడ్చర్ల లోని సంజీవయ్య కాలనీలో గాలి మనకు రెండు ఇండ్లు నేలమట్టం అయ్యాయి. తాలూకా క్లబ్ రోడ్డులో భారీ వేపచెట్టు వృక్షం నేలకొరిగింది. ధాన్యం నేలపాలు..అదేవిధంగా బాదేపల్లి మార్కెట్ యార్డులో, పత్తి మార్కెట్ యార్డులో వడ్లతో పాటు మక్కలు పెద్ద ఎత్తున తడిసి ముద్ద అయ్యాయి. వందల క్వింటాలలో ధాన్యం నేలపాలు కావడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. ధాన్యం మార్కెట్ యార్డుకు తీసుకువచ్చి నెల రోజులకు పైగా అవుతుంది అని, తూకం చేసిన ధాన్యం దింపుకోవడానికి గోదాంలో జాగా లేదని హమాలీలు లేరు అని అధికారులు నిరక్ష్యం వహి వహించడంతోనే నేడు ఈ దుస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమయానికి దాన్యం కొనుగోలు చేసి గోదాములలో నిల్వ చేసి ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం ఎలాగైనా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



జడ్చర్ల మార్కెట్‌లో తడిసిన ధాన్యం

## గాలివాన బీభత్సం

**ఆత్మకూరు మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం**

**లబోదిబోమంటన్న రైతాంగం**

**ఆత్మకూర్, ప్రభాతవార్త మే 16:** ఆత్మకూరు మండలంలో శనివారం సాయంత్రం ఒక్కసారిగా గాలివాన బీభత్సం సృష్టించడంతో ఆత్మకూరు మరికల్ ప్రధాన రహదారిపై చెట్లు విరిగిపడి పోగా ప్రయాణికులు ఐక్యతకు గురయ్యారు. సాయంత్రం ఐదు గంటల నుంచి ఒక్కసారిగా గాలివాన బీభత్సం సృష్టించడంతో ఆత్మకూరు పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో రైతులు ఆరబోసిన ధాన్యం వర్షానికి తలచిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. గడచిన 15 రోజులుగా ఆత్మకూరు మార్కెట్ యార్డులో వరి ధాన్యం కుప్పలుగా పోసినప్పటికీ గన్ని బ్యాగులు లేవంటూ అధికారులు ధాన్యాన్ని తరలించకుండా కాలయాపన చేయడంతో అకాల వర్షానికి వరి ధాన్యం తడిసిపోవడమే కాకుండా వర్షానికి కొట్టుకుపోవడంతో తమ పరిస్థితి దిక్కుతోచని విధంగా తయారైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం సాయంత్రం నుండి ఆత్మకూరు మండలంలోని వివిధ గ్రామాలలో గాలివాన విభస్తానికి విద్యుత్ తీగలు మరియు విద్యుత్ స్తంభాలు నేల కోలడంతో అంధకారం ఏర్పడింది. మార్కెట్ యార్డ్ ఆవరణలో తడిసిన వరి ధాన్యాన్ని అధికారులు ఎలాంటి షరతులు విధించకుండా కొనుగోలు చేయాలని ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యం కూడా తక్షణమే తరలించేందుకు ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన చేయాలని పలు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆత్మకూర్ అమరచింత ప్రధాన రహదారిపై విరిగిపడ్డ చెట్లు

**బాధిత కుటుంబాలను**

## పునరావాస కేంద్రాలకు తరలించాలి

**కూలిన ఇండ్లను పరిశీలించి ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి..**

**భారీ వర్షం నష్టంపై వెంటనే నివేదిక ఇవ్వాలి**

**జడ్చర్ల, మే 16,ప్రభాతవార్త :** జడ్చర్ల మున్సిపాలిటీలో కురిసిన భారీ వర్షం కారణంగా జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని సంజీవయ్య కాలనీతో పాటు పలు వార్డుల్లో ఇండ్లు కూలిపోయిన ప్రాంతాలను శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి పరిశీలించారు. బాధిత కుటుంబాలను ప్రత్యక్షంగా పరామర్శించి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వర్షం వల్ల నష్టపోయిన కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అకాల వర్షాల వల్ల నష్టపోయిన ప్రతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇండ్లు కోల్పోయిన కుటుంబాలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించి అవసరమైన ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే నష్టపోయిన ఇండ్లు, ఆస్తులపై వెంటనే పూర్తి స్థాయి అంచనా నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని సూచించారు.

## పనుల్లో వేగం పెంచాలి

**కలెక్టర్ సీహెచ్ ప్రియాంక**

**నారాయణపేట, మే 16 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను వేగవంతం చేసి జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ వీసీ హాల్‌లో ఎస్ఈలు, ఈఈలు, డీఈలు, ఏఈలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పలు శాఖల పనుల పురోగతిని పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల,ఎంసీహెచ్, నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులపై ఆరా తీసిన కలెక్టర్, మెడికల్ కళాశాల వద్ద బోరు లేకుండా క్యూరింగ్ ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్మాణాల్లో తప్పనిసరిగా వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జనరేటర్ వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలు, పీఎం శ్రీ పాఠశాలల సైన్స్ ల్యాబ్ నిర్మాణాలు, 2023,24 మరియు 2024,25 సంవత్సరాలకు చెందిన పెండింగ్ పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మక్తల్ లో వంద పడకల ఆస్పత్రి, జూనియర్ కళాశాల గదులు, వసతి గృహ మరమ్మతు పనులను వేగవంతం చేయాలని సూచించారు. సమీకృత చేనేత భవనం, మహిళా సమాఖ్య భవనం జూన్ 2 నాటికి ప్రారంభానికి సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. మిషన్ భగీరథ, రోడ్ల నిర్మాణాలు, కొత్త కలెక్టరేట్ భవనం వంటి పనులను కూడా వేగ వంతం చేయాలని సూచించారు. ఇంజనీరింగ్ అధికారులతో ఇది తొలి సమావేశమని వచ్చే సమావేశానికి పూర్తి చేసిన పనుల వివరాలతో హాజరు కావాలని హెచ్చరించారు. అభివృద్ధి పనుల్లో ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని సూచించారు.




మాట్లాడుతున్న కలెక్టర్ సీహెచ్ ప్రియాంక

# ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

- వైభవంగా విద్యా వారోత్సవాలు,
- విద్యా వారోత్సవాల్లో మెరిసిన విద్యార్థుల ప్రతిభ,
- గ్రామీణ విద్యార్థుల్లో అపార ప్రతిభ ఉంది..
- ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు,బహుమతులు
- నాగర్‌కర్నూల్ కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 16 ప్రభాతవార్త:** విద్యార్థులు పాఠ్యపుస్తకాలలోని విషయాలను మాత్రమే నేర్చుకోవడం సరిపోదని, జీవితంలో విజయవంతం కావాలంటే ఇతర రంగాల్లో కూడా చురుకుగా పాల్గొనాల్సిన అవసరం ఉందని, సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, వేదికపై మాట్లాడే ధైర్యం మరియు కళాత్మక ప్రతిభను పెంపొందిస్తాయని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాలను విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాన్ని శనివారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, విద్యా ప్రదర్శనలు, ప్రతిభా ప్రదర్శనలతో సభా ప్రాంగణం ఉత్సాహభరిత వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు స్వాగత నృత్యాలు, జానపద కళారూపాలు, దేశభక్తి గీతాలు, సామాజిక సందేశాలతో కూడిన నాటికలను ప్రదర్శించి అతిథులను అలరించారు. విద్యార్థులు రూపొందించిన టిఎల్ఎంను తిలకించి, విద్యార్థుల ప్రతిభను చూసి జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సాంస్కృతిక, క్రీడా, సృజనాత్మక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఇలాంటి విద్యా వారోత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని, భవిష్యత్ సమాజ నిర్మాణంలో విద్యార్థులే ప్రధాన శక్తిగా నిలుస్తారని, అందుకే వారిలో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, క్రమశిక్షణ పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అనేక సంస్కరణలు అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. డిజిటల్ విద్య, స్మార్ట్ క్లాస్‌రూమ్స్, మౌలిక వసతుల అభివృద్ధి, ఆంగ్ల మాధ్యమ బోధన వంటి చర్యల ద్వారా ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి వారిని ఉన్నత లక్ష్యాల దిశగా నడిపించాలని సూచించారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం విద్యతో పాటు నైతిక విలువలు కూడా ఎంతో అవసరమని కలెక్టర్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా ఉన్నత స్థాయికి ఎదగగల సామర్థ్యం కలిగి ఉన్నారని, వారికి సరైన మార్గదర్శకత్వం లభిస్తే దేశానికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. విద్యా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, సైన్స్ ప్రదర్శనలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు, మెడల్స్, బహుమతులు అందజేశారు. బహుమతులు అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్, నోడల్ అధికారి కురుమయ్య, సెక్టోరియల్ అధికారులు కిరణ్ కుమార్, నూరుద్దీన్, వెంకటయ్య మురళీధర్ రెడ్డి శోభారాణి, షర్ఫుద్దీన్, ఎస్ జి ఎఫ్ కార్యదర్శి నాగేశ్వర్ రావు, వివిధ మండలాల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు ఇతర అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



**ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే**

## కార్పొరేట్ స్థాయి వైద్యం

**మంత్రి జూపల్లి కృష్ణారావు**

**డయాలసిస్ కేంద్రానికి నిరంతర విద్యుత్ సరఫరా**

**ఏరియా ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి**

**కొల్లాపూర్,మే 16,ప్రభాతవార్త :** పేద, మధ్య తరగతి ప్రజలు చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా, ప్రభుత్వ వైద్యశాలల్లోనే అన్ని రకాల వైద్యసేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. కొల్లాపూర్ ఏరియా ఆసుపత్రిని స్వయంగా మంత్రి బుల్లెట్ బైక్ మీద తిరిగి ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, రోగులకు అందుతున్న సేవలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. డయాలసిస్ రోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యను పరిష్కరిస్తూ, ఆసుపత్రికి నేటి నుంచే 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాను అందుబాటులోకి తెచ్చినట్లు మంత్రి ప్రకటించారు. ప్రజలు వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ దవాఖానాల్లోనే అన్ని వసతులు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. నేటి నుంచి ఎలాంటి బ్రేక్ లేకుండా 24గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. దీనివల్ల రోగులకు సకాలంలో, సురక్షితంగా వైద్యం అందుతుందన్నారు. అలాగే డయాలసిస్ కేంద్రంలో అదనపు బెడ్లు, ఏసీల ఏర్పాటుతో పాటు రోగుల కోసం ప్రత్యేకంగామరో అంబులెన్స్‌ను కూడా అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. గత 2018 సంవత్సరంలో రూ.22 కోట్ల వ్యయంతో మంజూరైన 100 పడకల నూతన ఆసుపత్రి భవన పనులు పూర్తయ్యాయని, త్వరలోనే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా చేతుల మీదుగా దీనిని ప్రారంభించనున్నట్లు జూపల్లి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

**జడ్చర్లలో యువతి**

## దారుణ హత్య



**ప్రేమోన్మాది కిరాతకం**

**జడ్చర్ల మే 16, ప్రభాతవార్త:** జడ్చర్లలో శనివారం సాయంత్రం యువతి దారుణ హత్యకు గురైన ఘటన చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే నిమ్మబావి గడ్డ ప్రాంతానికి రామచందర్,లతా దంపతుల కుమార్తె వైష్ణవి (23) ఎస్‌వీకేఎం పాఠశాలలో రిసెప్షనిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్నది. శనివారం సాయంత్రం విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న కరుణంలో కాలనీ సమీపంలో మార్పు వేసిన యువకుడు కత్తితో వైష్ణవి కడుపులో గొంతు దగ్గర పొడవడంతో అక్కడికక్కడే కుప్పకూలి పోయింది. గమనించిన స్థానికులు యువకుడిని పట్టుకొని చితకబాదారు. యువతీ యువత మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. దవఖాన వద్ద కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కాలనీ వాసులు పెద్దఎత్తున దవాఖానకు చేరు కోవడంతో సిఐ కమలాకర్ ఎస్ఐలు బృందంతో కలిసి దవాఖాన వద్దకు చేరుకొని కుటుంబ సభ్యులతో వివరాలు ఆరా తీశారు. తమ కూతురిని గతం నుంచి ఒక యువకుడు వేధిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు యువకుడికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరించి కేసు నమోదు చేరినట్లు సిఐ తెలిపారు.

## వైష్ణవి హత్య ఘటన బాధాకరం..

**ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి.. బాధిత కుటుంబాన్ని పరామర్శ**

**జడ్చర్ల, మే 16, ప్రభాతవార్త :** జడ్చర్ల మున్సిపాలిటీలోని నిమ్మబావిగడ్డకు చెందిన వైష్ణవి అనే యువతి దారుణ హత్యకు గురైన ఘటనపై జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలేపల్లి సెజ్‌లోని ఎస్‌వీకేఎం పాఠశాలలో విధులు నిర్వహించుకుని ఇంటికి వస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి కత్తితో గొంతులో దాడి చేయడంతో వైష్ణవి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హుటాహుటిన నిమ్మబావిగడ్డలోని ఆమె నివాసానికి చేరుకుని వైష్ణవి పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని తెలిపారు. నిందితుడిపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. వైష్ణవి హత్యకు గురైన నేపథ్యంలో ఆమె మృతదేహాన్ని మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి, రేపు ఉదయం పంచనామా నిర్వహించి అనుభవజ్ఞులైన వైద్యులచే పోస్టుమార్టం నిర్వహించాలని వైద్య అధికారులను కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



## 3.150 కేజీల గంజాయి సీజ్

**వివరాలు వెల్లడించిన అసిస్టెంట్ ఎక్సైజ్**

**సూపరిండెంట్ నరసింహారెడ్డి**

**జడ్చర్ల మే 16 ప్రభాతవార్త:** బీహార్ నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు మహబూబ్ నగర్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహారెడ్డి తెలిపారు. జడ్చర్ల ఎక్సైజ్ పోలీస్ కార్యాలయంలో ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. మహబూబ్నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం బాలానగర్ మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సీఐ విప్లవరెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై లు కార్తీక్ రెడ్డి, నాగరాజు బృందంతో కలిసి వెళ్లి విచారించారు. నిందితుడు బీహార్ లోని పాట్నాకు చెందిన ఉపేందర్ గా గుర్తించారు. అతని వద్ద 3.150 కేజీల గంజాయితో పాటు ఒక సెల్ ఫోన్, హోండా వెహికల్ ను సీజ్ చేశారు. ఉపేందర్ ను విచారించగా బీహార్ నుంచి తీసుకొచ్చి మూడు నుంచి నాలుగు గ్రాముల ఒక ప్యాకెట్ గా చేసి రూ. 400కు విక్రయిస్తున్నట్లు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. ఎవరైనా ఎక్కడైనా గాంజాయి విక్రయించిన కొన్న సెల్ ఫోన్ నెంబర్లు 9030019943, 8712658866 సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు కోపంగా ఉంచుతామని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ తెలిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్సైలను, వారి బృందాన్ని ఆయన అభినందించారు.

## అన్నీ తామై..

**ఆదరించి.. వైద్యం అందించి..**

- ఆరు నెలలు వనపర్తి ప్రభుత్వ దవఖానాలో సేవలు..
- ఆచూకీ సేకరించి కుటుంబ సభ్యులకు అప్పగింత..
- సిబ్బందిని అభినందిస్తున్న స్థానికులు, వైద్య అధికారులు



**వనపర్తి ప్రతినిధి, మే 16, ప్రభాతవార్త:** సొంతవాళ్లను పట్టించుకోవడానికి సమయం లేని ఈ రోజుల్లో, మతిస్థిమితం సరిగ్గా లేని ఓ మహిళను గుర్తించి వన్ జీరో ఎయిట్ అంబులెన్స్ లో దవాఖానకు తీసుకొచ్చి, ఆరు నెలల పాటు ఆదరించి వైద్యం అందిం చారు. ఒక చిన్న ఆధారం ద్వారా కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకొని తిరిగి మహిళ ను సొంత కుటుంబ సభ్యులకు చేసిన వైద్య సిబ్బందిని ఇటు ప్రజలు అటువైద్య అధికా రులు అభినందిస్తున్నారు. గత సంవత్సరం డిసెంబర్ 11వ తేదీన కొత్తకోట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఉన్న ఒక ఒంటరి మహిళను గుర్తించిన 108 సిబ్బంది చికిత్స నిమిత్తం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చి చికిత్సను అందిం చారు. అనంతరం రోగి యొక్క కుటుంబ వివరాలు అడగగా తను మతిస్థిమితం కోల్పోయి నట్టుగా ఎలాంటి సమాధానం ఇవ్వకుండా ఉండిపోయింది. ఇలా దాదాపు ఆరు నెలలుగా తన నుండి ఎలాంటి సమాధానం లేకపోయినా అప్పటికి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది మాత్రం తనకు సేవలందించడంలో ఏ మాత్రం వెనకాడ లేదు ప్రతిరోజు గాయాలకు డ్రెస్సింగ్ చేయడం, వారే కొన్ని దుస్తులు తీసుకొచ్చి ప్రతిరోజు దుస్తులు వేయించడం, సమయానికి భోజనం అందించడం ఇలా సొంత కుటుంబ సభ్యులకు సేవలు అందించి నట్టుగా అక్కున చేర్చుకొని వారి యొక్క ఔనత్యాన్ని చాటుకున్నారు. మెడికో సోషల్ వర్కర్ ధారావత్ లక్ష్మి మ్మనాలుగు రోజుల క్రితం జిజిహెచ్ ఆర్ ఎం ఓ జావిద్ మెడికో సోషల్ వర్కర్ అయిన ధారావత్ లక్ష్మి మ్మకి రోగి యొక్క కుటుంబ వివరాలు తెలుసుకోమని సూచించగా లక్ష్మి మ్మ తనతో మాట్లాడే ప్రయత్నం చేస్తూ రోగి యొక్క వివరాలు సూర్యాపేట జిల్లా వర్ధమాన్ కోటకు చెందినదిగా గుర్తించారు. వర్ధమన్ కోటకు చెందిన ఆశా వర్కర్ ద్వారా శోభ అనే పేరు, వయస్సు గురించి ఆరా తీసి రోగి స్వస్థలము అక్కడేనని నిర్ధారించుకున్నామని, వారి ఫోన్ నెంబర్ సేకరించి వారితో మాట్లాడగా శోభ సూర్యాపేట జిల్లా వర్ధమాన్ కోటకు చెందిందని పూర్తిగా నిర్ధారించుకున్నారు. తల్లి, తండ్రుయాదగిరి, ఉపేంద్రఇన్ని రోజులుగా కనిపించకుండా పోయిన మా కూతురు చనిపోయిందని అనుకున్నామని, ఒక్కసారిగా వనపర్తి జిల్లా ఆసుపత్రిలో మా కూతురు ఉందని తెలియడంతో ఆనందం వ్యక్తం చేస్తూ ఒక రోగిలా కాకుండా తన సొంత మనిషిలా ఇన్ని రోజులుగా తన కూతురిని చికిత్స అందించిన సిబ్బంది ఆర్ ఎం వో జావిద్, డాక్టర్ మేఘన, సిస్టర్ రేణుక రాజ్, జయంతి, పద్మావతి, మహాలక్ష్మి మ్మ, మెడికో సోషల్ వర్కర్ ధరావత్ లక్ష్మీ మ్మలకు వారి కృతజ్ఞతలు తెలియజేశారు.



## పెట్రోల్, డీజిల్,వంటగ్యాస్ ధరలను తగ్గించాలి

**సిపిఎం నాయకులతో రాస్తారోకో**

**మదనాపురం, మే 16 ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా శుక్రవారం నుండి అనూహ్యంగా పెట్రోల్ డీజిల్ ధరలను పెంచడం పేద ప్రజలపై పెనుభారాన్ని మోపడమేనని ఎం వెంకట రాములు అన్నారు. శనివారం మండల కేంద్రంలో సిపిఎం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరుగుతున్న రాబోయే రోజుల్లో దేశంలో పెట్రోల్ డీజిల్ ధరలు, ఏమాత్రం పెంచబోమని, ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఎన్నికలు ముగిసి మూడు వారాలైన కాకముందే ఒక్కసారిగా పెట్రోల్ డీజిల్ పై కమర్షియల్ సిలిండర్ పై 993 నుంచి రూ.3000లుఅధిక ధరలు పెంచి ప్రజలను మోసగించడం తగదన్నారు. చిరు వ్యాపారాలు పెద్ద హోటళ్ళు మూతబడ్డాయని విమర్శించారు. ఇప్పటికే నిత్యావసర ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో తిరిగి ఒక్కసారిగా పెట్రోల్, డీజిల్ పై లీటరుకు మూడు రూపాయలు అదనంగా పెంచి కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజల నడ్డి విరిచిందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ నోరు మెదపడం లేదని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే పెంచిన డీజిల్ పెట్రోల్ ధరలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు మణివర్ధన్, మాసన్న, శ్రీధర్, ప్రసాద్, సత్య నారాయణ, చంద్రాయుడు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కార్యాలయంలో విద్య వారోత్సవాలు

**పెద్దమందడి, మే 16 ప్రభాతవార్త :** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్ రావు ఆధ్వర్యంలో మోజర్ల మధుగట్ల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు విద్యా వారోత్సవాల సందర్భంగా కళలు హస్తకళలు, సాంస్కృతిక దినోత్సవం సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మద్దిగట్ల మోజర్ల మండలం పెద్దమందరెడ్డి విద్యార్థులు బంజారా నృత్యం తెలంగాణ బోనాల పండుగ సంబంధించిన నృత్యం అద్భుతంగా చేయడం జరిగింది. జిల్లా అడిషనల్ కలెక్టర్ కిమ్యా నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ గని, ఈ కార్యక్రమాలను ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో పెద్దమందడి మండలం నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మద్దిగట్ల మోజర్ల విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనను పెద్దమందడి మండల విద్యాధికారి మంజులత తిలకించి సంతృప్తి వ్యక్తం చేయడం జరిగింది. పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు వరప్రసాద్ రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యా వారోత్సవాలు భాగంగా జిల్లా నలుమూలల నుండి విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో జిసిడిఓ ఇందిరా జిల్లా కోఆర్డినేటర్లు శేఖర్, మహానంది, నారాయణమ్మ, ప్రతాపరెడ్డి, జిల్లా పిఆర్టియు పిఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.బౌద్ధారెడ్డి, ఎస్ చంద్రశేఖర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రేవల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, విద్యాశాఖ సిబ్బంది చిక్కేపల్లి ప్రధానోపాధ్యాయులు శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత కేసు నమోదు

**రేవల్లి, మే 16 ప్రభాతవార్త:** రేవల్లి పోలీస్ స్టేషన్లో ఇసుక ట్రాక్టర్ పై కేసు నమోదు అయిన సంఘటన శనివారం తెల్లవారుజామున రాత్రి 12:30 గం.కు కొంకలపల్లి శివారులో ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ ను ఆపి ఇసుక రవాణాకు సంబంధించిన అనుమతి పత్రాలు అడిగారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేవు అని తెలుపగా. ట్రాక్టర్ డ్రైవర్ , ఓనర్ పేరు పెద్దముక్కుల బాషా, కొంకలపల్లి గ్రామం అని తెలిపాడు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి ఏఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైతులకు టార్పాలిన్ కవర్‌ల పంపిణీ

**వనపర్తి రూరల్, మే16, ప్రభాతవార్త:** భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ ( ఐసిఏఆర్) రాజేంద్రనగర్ హైదరాబాద్ వారి సౌజన్యం తో టార్పాలిన్ కవర్‌లను రైతులకు పంపిణీ చేశారు. శనివారం ఐసీఏఆర్, ఐఐఎంఆర్, ప్రధాన శాస్త్రవేత్త డా.ఏ. కళైసేకర్, డా.కె. శ్రీనివాస బాబు సూచన మేరకు వనపర్తి మండలం అప్పాయిపల్లి గ్రామంలో సర్పంచ్ పద్మా విష్ణు అధ్యక్షతన గ్రామ రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసిఏ ఆర్ సినియర్ టెక్నికల్ అసిస్టెంట్



జక్కుల భగవంతు యాదవ్ ఆధ్వర్యంలో 100 మంది ఎస్సీ సన్న, చిన్న కారు రైతులకు శిక్షణ తో పాటు రూ. 3500 ల విలువైన తార్పాలిన్ కవర్స్ ను గ్రామ సర్పంచ్ పద్మా విష్ణు,ఉమ్మడి జిల్లా మాజీ డిసిసిబి ఉపాధ్యక్షులు డి.శంకర్రావు, మాజీ సర్పంచ్ డి రామారావు,ఉప సర్పంచ్ దాసు,తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఐజేయు జిల్లా అధ్యక్షులు మాధవరావు, గ్రామ కార్యదర్శి నర్మదా, అగ్రికల్చర్ అధికారి కురుమయ్య,రెవెన్యూ అధికారి వెంకటన్న, ఐసిఆర్ శాస్త్రవేత్తలు డా. జీవిత, డా. రాజశేఖర్, సిబ్బంది కోమలి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు చిరుధాన్యాలపై దృష్టి సారించాలని, పంట మార్పిడితో పాటు అధిక దిగుబడి అధిక లాభాలు కూడా అందుతాయని అన్నారు. కార్యక్రమంలో గ్రామ రైతులు చిన్న వెంకటన్న, జే.రాములు, వి.శ్రీనివాసులు, కే.అంజనేయులు, కే.బాలస్వామి, జె తిరుపతయ్య, ఆర్.బాలకృష్ణయ్య ,పెంటమ్మ సంధ్యమ్మ పాల్గొన్నారు.

## బాధితులకు ప్రభుత్వ నష్టపరిహారం అందజేత

**డా. జిల్లెల చిన్నారెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన బాధితులు**

**గోపాల్ పేట, మే 16 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా గోపాల్‌పేట్ మండలం జయన్న తిరుమలాపురం గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన పశువుల యజమానులకు ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందజేశారు. అక్టోబర్ 24న పూసల చెరువు సమీపంలో జరిగిన ఈ ఘటనలో మొత్తం 8 బర్రెలు మృతి చెందాయి. దీంతో తీవ్రంగా నష్టపోయిన రైతులు తమకు ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డి ని కోరారు. రైతుల పరిస్థితిని పరిగణనలోకి తీసుకున్న చిన్నారెడ్డి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి బాధిత రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టారు. దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు ఒక్కో బర్రెకు రూ.40 వేల చొప్పున నష్టపరిహారం మంజూరు చేశారు. ఈ సందర్భంగా మద్దులకొల్ల మల్లయ్య భార్య గీతకు రూ.2,40,000 చెక్కును, భాస్కర్ రెడ్డికి రూ.80,000 చెక్కును డా. జిల్లెల చిన్నారెడ్డి, విద్యుత్ శాఖ తరపున జిల్లెల తిరుపతి రెడ్డి, గ్రామ సర్పంచ్ కావలి జ్యోతి గోపాల్ కలిసి శనివారం అందజేశారు. ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందించినందుకు బాధిత రైతులు గీత, భాస్కర్ రెడ్డి లు రాష్ట్ర ప్రభుత్వం, చిన్నారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లోకారెడ్డి, రంగారెడ్డి, కురుమయ్య, కురువమ్మ తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

**లింగాల హై స్కూల్ అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు మంగమ్మ**

లింగాల,మే 16,ప్రభాతవార్త : పిల్లల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలలోనే లభిస్తుందని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి బంగారు బాటలు వేయాలని లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు మంగమ్మ అన్నారు. బడిబాట కార్యక్రమం పురస్కరించుకొని లింగాల హైస్కూల్ చదువుతూ పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యా విద్యార్థులకు విద్య విజయోత్సవం కార్యక్రమంలో భాగంగా లింగాల హై స్కూల్ ప్రాంగణంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నిష్ణాతులను ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యాబోధన అందుతుందని అన్నారు. గుణాత్మక విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం తదితర వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం కొండయ్య, వెంకటేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

## అంబటిపల్లి విద్యార్థుల ప్రతిభ

**లింగాల, మే 16,ప్రభాత వార్త :** విద్యార్థుల భవిష్యత్తు కు మార్గదర్శకమే ప్రభుత్వం చేపట్టిన పీఎం సమ్మర్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకుంటూ అంబటిపల్లి విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ చేత బహుమతి, ప్రశంసా పత్రాన్ని అందుకున్నట్లు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు నిరంజన్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా శనివారం జరిగిన కార్యక్రమంలో అంబటి పల్లి పీఎం సమ్మర్ క్యాంప్ విద్యార్థిని చిత్రలేఖనంలో ప్రతిభ కనబరుస్తూ జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధించింది. అదేవిధంగా డాన్స్ పోటీల్లో మహేశ్వరి అండ్ టీం ప్రావీణ్యం కనబరుచుతూ జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధించింది. చిత్రలేఖనం డాన్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ చేతుల మీదుగా బహుమతిని ప్రశంసా పత్రాన్ని అందుకున్నట్లు వెల్లడించారు. ముందస్తు ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్న వంద మంది విద్యార్థులకు ఈనెల 25 వరకు పిఎం సమ్మర్ క్యాంపులో భాగంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, కుట్లు అల్లికలు, డాన్సులో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు..

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ

**ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలి: అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్**

**జూన్ నెలలో ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్**



వీసీ లో పాల్గొన్న అదనపు కలెక్టర్, జిల్లా అధికారులు

**వనపర్తి, మే 16, ప్రభాతవార్త:** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్దేశిత ప్రణాళికా ప్రకారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ ఆదేశించారు. జూన్ నెలలో ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్లతో తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి సూర్యప్రకాష్, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి వీసీలో పాల్గొన్నారు. సీఈఓ మాట్లాడుతూ తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను చేపడుతూ భారత ఎన్నికల కమిషన్ కీలక షెడ్యూల్‌ను విడుదల చేసిందన్నారు. ఈ షెడ్యూల్ ప్రకారం, 2026 జూన్ 15 నుండి 24 వరకు బీఎల్‌వో లకు, సంబంధిత సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అనంతరం, జూన్ 25 నుండి జూలై 24 వరకు నెల రోజుల పాటు క్షేత్రస్థాయిలో బీ ఎల్ వో లు ఇంటింటి సర్వే నిర్వహించి వివరాలను సేకరించడం జరుగుతుందన్నారు. సర్వే అనంతరం, జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఈ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు లేదా సవరణలు ఉంటే ఆగస్టు 30 వరకు స్వీకరించడం జరుగుతుందని, అభ్యంతరాల్ని సెప్టెంబర్ 28 వరకు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. అన్ని అభ్యంతరాలను పరిశీలించి, పరిష్కరించిన తర్వాత, చివరగా అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం నిర్వహణ విజయవంతం చేయాలన్నారు. జూన్ నెలలో ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నేపథ్యంలో ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసి పూర్తిచేయాలని ఆదేశించారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ షెడ్యూల్ తెలియజేయాలని సూచించారు. అదేవిధంగా రాజకీయ పార్టీలు బిఎల్ఎ లను నియామకం చేసుకొని వారి జాబితా సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా, పెండింగ్ లో ఉన్న ఫారం 6, 7, 8 అప్లికేషన్లను త్వరితగతిన పరిష్కారం చేయాలని ఆదేశించారు. వీసీ అనంతరం జిల్లా అధికారులతో అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్దేశిత ప్రణాళికా ప్రకారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నిర్వహించి, విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(ఎస్ ఐ ఆర్)కు సంబంధించి ఎన్నికల సంఘం వెలువరించిన షెడ్యూల్ ను ప్రజలందరికి తెలియజేయాలన్నారు. ఇక ఎస్ ఐ ఆర్ లో భాగంగా నిర్వహిస్తున్న మాపింగ్ ప్రక్రియ వనపర్తి లో 79.81 శాతం పూర్తి అయిందని, ఇంకా వేగవంతం చేసి మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించి తమ ఓటరు వివరాలను సరిచేసుకోవాలని, అవసరమైన పత్రాలను అందుబాటులో ఉంచాలని అదనపు కలెక్టర్ కోరారు. సమావేశంలో సి సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డి సెక్షన్ సూపరింటెండెంట్ మదన్, జిల్లా ఎన్నికల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అవగాహన ర్యాలీ

**కల్వకుర్తి, మే 16 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో శనివారం జాతీయ డెంగ్యూ దినోత్సవ అవగాహన ర్యాలీని క్లస్టర్ ఆధ్వర్యంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ భీమా నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డెంగ్యూ దినోత్సవ గురించి, దాని లక్షణాలు గురించి అవగాహన కల్పించే ప్లకార్డులు ధరించి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని, మన వంతం డెంగ్యూ అంతం, అందరం సంఘటితంగా డెంగ్యూని ప్రారదోలుదాం తదితర నినాదాలు ఇస్తూ పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ సబ్ యూనిట్ ఆఫీసర్ పర్వతాలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసు, డిప్యూటీ పారామెడికల్ ఆజాద్, ఆర్‌బిఎస్ కే.వైద్యాధికారులు, సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు, వైద్య సిబ్బంది, పర్యవేక్షణ సిబ్బందిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులకు భూమి పూజ

**కల్వకుర్తి, మే 16 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటీలోని 15వ వార్డులో కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో మంజూరైనా సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్, వైస్ చైర్మన్ శానావాజ్ ఖాన్, 15వ కౌన్సిలర్ కుదుముల అష్మితా చంద్రకాంత్ రెడ్డిలు ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చీమ్ముల శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పుస్తకాల రాహుల్, కౌన్సిలర్ లు రాజేష్ కుమార్, గణేష్ యాదవ్, రమాకాంత్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఖలీల్, నాయకులు ఖుద్దుస్, జమ్ముల శ్రీకాంత్, శ్రీకాంత్, శివ కుమార్, పడకంటి వెంకటేష్, దున్న సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుతో కొడుకు మృతి

**తండ్రికి గాయాలు..**

**అయిజ, మే 16 ప్రభాతవార్త:** మండల పరిధిలోని తుపత్రాల గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న తండ్రి కొడుకుల పై అకస్మాత్తుగా పడిన పిడుగుపాటుకు కొడుకు తీవ్ర గాయాలతో అక్కడక్కడ అక్కడికక్కడే మృతి చెందాడు తండ్రి స్వల్ప గాయాలతో బతికి బయటపడ్డ సంఘటన శనివారం జరిగింది గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వడ్డే శ్రీనివాసులు 45 అతని కుమారుడు నగేష్ 25 తమ వ్యవసాయ పొలంలో పనులు చేసుకుంటున్న క్రమంలో సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం ప్రారంభమైంది ఈ క్రమంలోనే పిడుగు పడటంతో నగేష్ అక్కడికక్కడే మృతి చెందారు తండ్రి శ్రీనివాసులు స్వల్ప గాయాలతో బయటపడడంతో ఆయనను చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి తరలించిన వారి కి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు అకస్మాత్తుగా జరిగిన ఈ సంఘటనతో గ్రామంలో నీ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు.

## శ్రీ శ్రీ పాగుంట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం

**కెటిదొడ్డి మే16 ప్రభాతవార్త:** కెటిదొడ్డి మండల పరిధిలోని వెంకటాపురం గ్రామం కొండపై వెలిసిన శ్రీ శ్రీ పాగుంట లక్ష్మీ ్మ వెంకటేశ్వర స్వామీ కళ్యాణం అంగ రంగ వైభవంగా జరిగింది. శనివారం అమావాస్య సందర్భంగా ఉదయం నుంచి అటు రాయిచూరు జిల్లా, ఇటు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా నుండి కాకుండా వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు భక్తి శ్రద్ధలతో దేవాలయంలో కిటకిటలాడుతు కనిపించారు. కార్యక్రమంలోని భాగంగా అర్చకులు స్వామివారికి అభిషేకం అర్చన పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.దాతలసహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. దేవాలయం పెద్దలు దేవాలయంకు వచ్చే భక్తులకు ఎండల తీవ్రత దృష్టిలో పెట్టుకొని చలువనీడలు ఏర్పాటు చేశారు.

# ఓటరు జాబితా పరిశీలనలో ప్రత్యేక చర్యలు

**స్వచ్ఛమైన ఓటరు జాబితా కోసం జిల్లా యంత్రాంగం**

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 16 ప్రభాతవార్త:** భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓఎస్), ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్ఓఎస్)తో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి, ఐఎఎస్ శనివారం హైదరాబాద్‌లోని సీఈఓ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం (ఈఎస్ఐ) త్వరలో ప్రకటించనున్నందున, మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి పురోగతి సాధించాలని కలెక్టర్లు, డీఈఓఎస్‌లను ఆయన ఆదేశించారు. నాగర్ కర్నూల్ కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ హాజరై మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 75 శాతం మ్యాపింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఓటరు జాబితాల పరిశీలన, బూత్‌ల వారీగా వివరాల సేకరణ, సిబ్బంది సమన్వయం వంటి అంశాల్లో ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా స్థాయిలో చేపడుతున్న ఏర్పాట్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డికు వివరించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, సర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని, అందుకోసం వారికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ వివరించారు. ముఖ్యంగా బూత్ స్థాయి ఏజెంట్ల నియామకంపై పార్టీలకు సూచనలు చేయనున్నట్లు, జిల్లాలో పెరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, సంబంధిత పని భారాన్ని దృష్టిలో ఉంచుకుని అదనంగా ముగ్గురు సహాయ అధికారులను నియమించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి ని కోరారు. అదనపు అధికారుల నియామకం ద్వారా మ్యాపింగ్, ఓటరు జాబితా పరిశీలన, ఫీల్డ్ స్థాయి పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని తెలిపారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి దశను కచ్చితంగా అమలు చేస్తూ, స్వచ్ఛమైన మరియు నిష్పాక్షి క ఓటర్ జాబితా రూపకల్పనకు జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ఆర్డీవోలు సురేష్ బాబు, యాదగిరి, బన్సీలాల్, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

## 20న మెడికల్ షాపుల బంద్

**మక్తల్ ఎస్ఐ, తహసీల్దార్‌కు కెమిస్టుల వినతి పత్రం**

మక్తల్, మే 16 ప్రభాతవార్త : ఈ నెల 20న నిర్వహించ తలపెట్టిన ఆల్ ఇండియా మెడికల్ షాప్స్ బంద్‌కు సహకరించాల్సిందిగా కోరుతూ మక్తల్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ప్రతినిధులు స్థానిక అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ కొండా విజయ్ కుమార్, మక్తల్ టౌన్ ప్రెసిడెంట్ మదన్ రెడ్డి, ట్రెజరర్ నౌలే ఉమాకాంత్ కలిసి స్థానిక ఎస్ఐని కలవగా, నారాయణపేట జిల్లా వ్యాప్తంగా జరగబోయే ఈ బంద్‌కు మద్దతు తెలపాలని కోరుతూ కెమిస్టులు సుధాకర్, ఉమాకాంత్, రామకృష్ణలు మక్తల్ తహసీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. స్థానిక వ్యాపారుల మనుగడను కాపాడుకునేందుకే ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వారు ఈ సందర్భంగా అధికారులకు వివరించారు. ప్రస్తుతం దేశంలో సాగుతున్న ఆన్‌లైన్ ఈఫార్మసీ విధానం, కార్పొరేట్ కంపెనీల అడ్డగోలు డిస్కౌంట్ల వల్ల స్థానిక మెడికల్ షాపుల యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ దోపిడీకి అడ్డుకట్ట వేయడానికే ఈ బంద్ నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ ఆన్‌లైన్ వ్యాపారాల వల్ల ప్రజలకు నాణ్యమైన మందులు అందడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం కొన్ని రకాల మందులను వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇవ్వకూడదని, ఒకవేళ ప్రిస్క్రిప్షన్ ఉన్నా వినియోగదారుడి ఫోన్ నంబర్, ఆధార్ వివరాలతో పాటు ఆ చీటిపై మందులు ఇచ్చినట్లు స్టాంప్ వేయడం చట్టరీత్యా తప్పనిసరని గుర్తుచేశారు. మళ్లీ మందులు కావాలంటే కొత్త ప్రిస్క్రిప్షన్ ఉండాల్సిందేనని, కానీ ప్రస్తుత ఆన్‌లైన్ ఈ ఫార్మసీలలో ఈ నిబంధనలను పూర్తిగా బేఖాతరు చేస్తూ ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నారని స్థానిక వ్యాపారులు తీవ్రంగా ఆరోపించారు.

## విబిజి గ్రామ్‌జి చట్టాన్ని రద్దు చేయాలి

**రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్.దేశ నాయక్**

అచ్చంపేట, మే,16 ప్రభాతవార్త: విబిజి రామ్ జి చట్టాన్ని తక్షణమే ఉపసంహరణ చేసుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దేశనాయక్ డిమాండ్ చేశారు. మండలంలోని రంగాపూర్ గ్రామంలో ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకొని వారి సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు దేశ నాయక్, మాట్లాడుతూ.. జులై 1 నుంచి విబిజి గ్రామ్ జి చట్టం అమలను తక్షణమే విరమించుకోవాలని పాత చట్టాన్ని కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న వేతనాలని తక్షణమే మంజూరు చేయాలని కోరారు. ఒకరోజు కూలికి కనీస కూలి రూ.600లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒక్కో వ్యక్తికి సంవత్సరంలో 200దినాలు కల్పించాలని కోరారు. రెండు పూటలా ఫోటో మ్యాచర్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని కోరారు. ఉపాధి సిబ్బందికి నాలుగు నెలల వేతనాలు ఇవ్వాలని సూచించారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలైన త్రాగునీరు టెన్ టు ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో ఉంచాలని కోరారు ప్రతి ఉపాధి కూలికి పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫేస్ ఫోటో మాచర్లను తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఉపశమనం చేసుకోకపోతే పెద్ద ఎత్తున ఉపాధి హామీ కూలీలతో ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడి చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సైదులు, సిఐటియు నాయకులు రాములు, ప్రజా సంఘాల నాయకులు రాజు, శివ, ఉపాధి హామీ కూలీలు శంకర్, లక్ష్మి, రాములు, వెంకటమ్మ, లక్షి ్మరెడ్డి పర్వతాలు, రజిత, సైదమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్ పాల్గొన్నారు.

## ఎక్సైజ్ అధికారులు మెరుపు దాడులు

**కేసులు నమోదు సిఐ సుబ్రహ్మణ్యం స్వామి**

**ఉప్పునుంతల, మే 16 ప్రభాతవార్త :** తెలకపల్లి ఎక్సైజ్ శాఖ సిఐ సుబ్రహ్మణ్యం స్వామి ఆధ్వర్యంలో శనివారం మండలంలో దాడులు నిర్వహించారు. మండలంలో అనుమతులు లేకుండా నడిపిస్తున్న మద్య దుకాణాలపై సీఐ సుబ్రహ్మణ్యం స్వామి ఆధ్వర్యంలో ఉప్పరిపల్లి, పెనిమిళ్ళ, వెల్టూర్, కంసానిపల్లి బెల్టు షాపులపై విస్తృత దాడులు నిర్వహించగా 1.25 లీటర్ల మద్యాన్ని, బీరు బాటిళ్లు భోజనం చేసుకొని 4 కేసులు నమోదు చేసినట్లు సిఐ పేర్కొన్నారు. అదేవిధంగా మండలంలోని జాతీయ రహదారికి అతి సమీపంలో కొనసాగిస్తున్న బాలాజీ వైన్స్‌పై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మండలంలో అనుమతులు లేకుండా ఎక్కడ మద్యం దుకాణాలు కొనసాగించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, నిషేధిత నాటుసారా, గంజాయి, మాదక ద్రవ్యాలను విక్రయిస్తే వారిపై ఎక్సైజ్ శాఖ పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేయడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ శాఖ సిఐ సుబ్రహ్మణ్యం స్వామితో పాటు ఎస్ఐ సృజన కుమార్, అరుణ పాల్గొన్నారు.

## సరిత తిరుపతయ్యకి ఎమ్మెల్యే శుభాకాంక్షలు

**దేవరకద్ర, మే 16 ప్రభాతవార్త:** షిప్స్ గోట్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ గా బాధ్యతలు స్వీకరించిన సరిత తిరుపతయ్య కి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి, నూతన బాధ్యతలో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షి ంచారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో ఆమె కీలకపాత్ర పోషించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సరిత నియామకం పట్ల కార్యకర్తలు, అభిమానులు, హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అభిమానులు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షం ఆందోళనలో రైతులు

నవాబుపేట, మే 17 ప్రభాతవార్త : శనివారం సాయంత్రం ఉరుముల మెరుపులతో కూడిన అకాల వర్షం పడటంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. చేతికొచ్చిన పంటను కోసి కల్లాల్లో కుప్పలు పెట్టుకున్న వరి ధాన్యం తడిసి కొందరు, పంట భూమిలోనే కోతకు వచ్చిన వరి చేను రైతులు భారీ వర్షం పడుతుందేమో అని వర్షానికి వడ్లు రాలిపోతాయేమోనని భయాందోళనలో కొంతమంది రైతులు ఆందోళన కు గురయ్యారు. మండల పరిధిలోని కాకరజాల, కిషన్ గూడా, లింగంపల్లి నవాబుపేట, కార్కొండ దొడ్డిపల్లి, ఏనుమనుగండ్ల పలు గ్రామాలలో ఉరుములు మెరుపులతో కూడిన మోస్తరు వర్షం పడి గాలివానకు రోడ్డు పక్కన ఉన్న చెట్లు విరిగిపడ్డాయి. రైతులు అప్రమత్తంగా ఉండి ధాన్యాన్ని భద్రపరచుకోవాలని ఉరుకులు పరుగులు పెట్టారు.

## కరెంట్ షాక్‌తో ఎద్దు మృతి

**మాగనూర్, మే 16 ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తో ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలోని వద్వాట్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. యజమాని దుళ్ళ తిమ్మప్ప వివరాల ప్రకారం తన పొలం దగ్గర నాలుగు ఎద్దులు చెట్టు నీడకు కట్టేసినట్లు తెలిపారు. పక్కనే ఉన్న కరెంటు తీగ తెగి ఎద్దులపై పడడంతో ఒక ఎద్దు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఎద్దుకు గాయలైనట్లు తెలిపారు. గడ్డివాము సైతం దగ్ధమైనట్లు చెప్పారు. ఈ ఘటనతో రైతుకు తీరని నష్టం జరిగినందున ప్రభుత్వం దయతో ఆర్థిక సాయం అందించాలని గ్రామ సర్పంచ్ రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు.

## విద్యుత్ అంతరాయం

**నారాయణపేట, మే 16 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణంలోని సివిల్1 ఫీడర్ మరమ్మత్తు పనుల కారణంగా ఆదివారం ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పట్టణ ఏఈ మహేష్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సివిల్1 పరిధిలోని సాయి విజయ్ కాలనీ, సత్యసాయి కాలనీ, చౌక్ బజార్, బ్రాహ్మణవాడి, కలాల్‌వాడి, శ్యాసన్‌పల్లి రోడ్డు, దామరగిద్ద రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మరమ్మత్తు పనులు పూర్తయ్యే వరకు తాత్కాలికంగా అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు, వ్యాపారులు, రైతులు సహకరించాలని ఏఈ విజ్ఞప్తి చేశారు. అసౌకర్యానికి క్షమించాలని కోరారు.

## కోచ్ విరాట్ కార్తీక్‌కు సన్మానం

**మక్తల్, మే 16 ప్రభాతవార్త :** 2026,27 విద్యా సంవత్సరానికి గానూ ప్రతిష్టాత్మక క్రీడా పాఠశాలలో సీటు సాధించిన క్రీడాకారిణి జీకే రత్నశ్రీ తండ్రి జీకే అరుణ్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు డి. వెంకటేష్ కలిసి శనివారం వీకె క్రికెట్ అకాడమీ కోచ్ విరాట్ కార్తీక్‌ను ఘనంగా సన్మానించారు.రత్నశ్రీ క్రీడా పాఠశాలలో సీటు సాధించడానికి కోచ్ విరాట్ కార్తీక్ అందించిన అద్భుతమైన శిక్షణ, నిరంతర ప్రోత్సాహమే ప్రధాన కారణమని ఈ సందర్భంగా వారు కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చడంలో వీకె క్రికెట్ అకాడమీ పాత్ర ఎంతో అభినందనీయమని వారు పేర్కొన్నారు. తమ కుమార్తెకు లభించిన ఈ అవకాశం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, కోచ్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొని రత్నశ్రీకి, కోచ్ విరాట్ కార్తీక్‌కు అభినందనలు తెలిపారు.

## రాయి కోడ్‌లో క్రికెట్ టోర్నీ ప్రారంభం

**నర్వ, మే 16 ప్రభాతవార్త :** నర్వ మండల పరిధిలోని రాయికోడ్ లో యువత,గ్రామ పెద్దల సౌజన్యంతో టెన్నిస్ బాల్ మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్,గ్రామ పెద్దల సమక్షంలో ప్రారంభించారు. గత నాలుగైదు సంవత్సరాలు గా రాయికోడు లో క్రికెట్ పోటీలను నిర్వహించడం అభినందనీయమని గ్రామ పెద్దలు కేవన్ స్వామి అన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని కొద్దిసేపు క్రీడాకారులతో క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మ్యాతరీ గోపాల్,కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పి.రవి, యువకులు మల్లన్ కోటి శంకర్, రఘు టీచర్, ఖాజా మైనొద్దీన్,గొల్ల మల్లేష్, యోసేపు, జి. భీమేష్,జి అశోక్, యం.వీరేష్, జి.నరసింహా, పెద్దమాలి రవి, నిర్వాహకులు జె.అంజి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## డీజిల్ పెట్రోల్ ధరల పెంపుకు

**వెల్దండ, మే 16 ప్రభాతవార్త:** వెల్దండ మండ్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పేర్కొన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై శనివారం బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పెట్రోల్ డీజిల్ ధరల పెంపునకై రాస్తారోకో చేపట్టి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యవసర ధరలతో పాటు డీజిల్ పెట్రోల్ ధరలు పెంచుతూ ప్రజలపై భారం మోపుతూ సామాన్యుడు కోలుకోలేని పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఎస్ఐ యుగేందర్ రెడ్డి చేరుకొని రాస్తారోకోను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పుట్ట రాంరెడ్డి, మాజీ జెడ్పీటిసి విజితా రెడ్డి, నాయకులు జోగయ్య, నిరంజన్, శేఖర్ ముదిరాజ్, గండికోట రాజు, ఆనంద్, లింగ ముదిరాజ్, యాదగిరి, హనుమంతు నాయక్, దేవేందర్, శేఖర్, జంగిలి ప్రసాద్, కొండల్, శంకర్ నాయక్ , తో పాటు ఉన్నారు.

## శని త్రయోదశి సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దంపతులు

**సైదాబాద్, మే 15 ప్రభాతవార్త:** శని త్రయోదశి సందర్భంగా ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కుటుంబ సమేతంగా శనివారం కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని శనీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మధుసాగర్, మల్లేష్‌గౌడ్, అభినవ్ సాగర్, అర్చకులు శంకరశర్మ, అంబాప్రసాద్, చంద్రకాంత్ శర్మ, ముత్యాల శర్మ, శ్రవణ్, ప్రవీణ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఓబిసి మోర్చా సెక్రటరీగా రమణ్ సింగ్

**సైదాబాద్, మే 15 ప్రభాతవార్త:** మలక్‌పేట నియోజవర్గానికి చెందిన పితాంబర్ రమణ్ సింగ్ బిజెపి ఓబిసి మోర్చా ఆఫీస్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ మేరు పార్టీ అధిష్టానం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రమణ్‌సింగ్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం చేపట్టే అన్ని కార్యక్రమాలు విజయవంతం చేయడానికి తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకం ఉంచి సెక్రటరీగా నియమించిన పార్టీ నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## అమావాస్య సందర్భంగా చంపాపేటలో అన్నదానం



అన్నదానం చేస్తున్న భగవాన్, రవి ముదిరాజ్

**సైదాబాద్, మే 15 ప్రభాతవార్త:** అమావాస్య సందర్భంగా శ్రీ మాత అన్నపూరేశ్వర్వరి అన్నప్రసాద వివరణ కమిటి చైర్మన్ దండేటి కార్ భగవత్ ఆధ్వర్యంలో చంపాపేటలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 37 నెలలుగా ప్రతి అమావాస్య రోజు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ యూత్ వింగ్ ఎల్‌బినగర్ అధ్యక్షుడు రవి ముదిరాజ్, సుశీల్ కుమార్, సంతోష్ లడ్డ, గణసాల వెంకటేష్, ఆడెళ్ల రాజు, అండేకార్ వెంకటేష్, టింగ్లికార్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి : డైరెక్టర్ మహమ్మద్ షకీల్



బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వైస్ చైర్మన్ సుబ్రహ్మణ్య ప్రసాద్ ను సన్మానిస్తున్న హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహమ్మద్ షకీల్, పోచమ్మ దేవాలయం కమిటీ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ తదితరులు

**మలక్ పేట, మే 16, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహమ్మద్ షకీల్, శ్రీ పోచమ్మ దేవాలయ కమిటీ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ లు పేర్కొన్నారు. తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వైస్ చైర్మన్ గా ప్రమాణస్వీకారం చేసిన పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్ ను వారు మర్యాదపూర్వ కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమావాస్య భోజనాల సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం



**తుర్కయంజాల్ మే 16, ప్రభాతవార్త**
ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ పరిధిలో జై వాసవి మాత హనుమాన్ అమావాస్య భోజనాల సేవా సమితి ఆధ్వర్యంలో గత 20 నెలలుగా నిరంతరాయంగా ప్రతి అమావాస్యకు అన్నదాన కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఈ నెల అమావాస్య భోజనాల కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా సేవాదళ్ అధ్యక్షులు కే. వీరేష్ గుప్తా వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. వాసవి క్లబ్ మండల అధ్యక్షుడు నరసింహ గుప్తా, మధుసూదన్ గుప్తా, మరియు దాచేపల్లి రాజగుప్త చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. సహకారం అందించిన వాసవి క్లబ్ అధ్యక్షుడు అయినటువంటి రంగ రాజశేఖర్ వారు ప్రతి అమావాస్య భోజనాలకు తన వంతు సాయం, సహకారాలు అందిస్తూ భాగస్వాములవుతున్నారు. ఈ అమావాస్య భోజనాల కార్యక్రమాన్ని జయప్రదం చేసిన ప్రతి ఒక్క దాతకు సేవా సమితి సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. దాతల ఉదారత, సహకారంతోనే ఈ మహత్కార్యం దిగ్విజయంగా ముందుకు సాగుతోందని వారు కొనియాడారు.

## హౌస్ లిస్టింగ్ కార్యక్రమాన్ని పరిశీలించిన కమిషనర్



**మల్కాజిగిరి మే 16, ప్రభాతవార్త:**
కమల్కాజ్గిరి సర్కిల్ పరిధిలో జరుగుతున్న గృహ గణన హౌస్ లిస్టింగ్ కార్యక్రమాన్ని శనివారం మిషనర్ వినయ్ కృష్ణారెడ్డి పరిశీలించారు ఈ సందర్భంగా ఈస్ట్ ఆనంద్ బాగ్ లో స్వయంగా కలిసి క్షేత్రస్థాయిలో నమోదు ప్రక్రియ సమగ్రంగా కచ్చితంగా వహించాలని సూచించారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో మొత్తం 4 వార్డులు ఉండగా, 281 హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ ఏర్పాటు చేయబడ్డాయి. ఈ కార్యక్రమం నిర్వహణకు 281 మంది ఎన్యూమరేటర్లు మరియు 39 మంది సూపర్వైజర్లు విధులు నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భముగా వినయకృష్ణ రెడ్డి గారు మాట్లాడుతూ ప్రజలు అందరు తమ ఇంటి వద్దకు వస్తున్నారు ఏనుమరేటర్స్ కి సహకరించాలని ప్రజలని చెప్పటం జరిగినది...కార్యక్రమంలో 1. జోనల్ కమిషనర్ శ్రీ సంచిత్ గంగ్వార్ గారు, 2. డిప్యూటీ కమిషనర్ శ్రీమతి జకియా సుల్తానా గారు, 3. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్రీ నరసింహా రెడ్డి గారు. మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెగా ఎంఎస్ఎంఈ క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమం



అర్హులైన పారిశ్రామిక వేత్తలకు రుణాలను అందజేస్తున్న బ్యాండ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్, బ్యాంక్ ఈడి ఎం.వి మురళీ కృష్ణ తదితరులు

**నాచారం, మే 16 ప్రభాతవార్త :** ఎంఎస్ఎంఈల అభివృద్ధి, యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, వ్యాపార విస్తరణకు ఆర్థిక సహాయం అందించాలనే లక్ష్యంతో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నాచారం పారిశ్రామిక వాడలో మెగా ఎంఎస్ఎంఈ క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ ప్రతినిధులు, వ్యాపారవేత్తలు, బ్యాంకింగ్ రంగ ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వి. మురళీ కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, మహిళా పారిశ్రామికవేత్తలు, స్వయం ఉపాధి యువతకు వేగవంతమైన, సులభతర రుణ సదుపాయాలు అందించేందుకు బ్యాంక్ కట్టుబడి ఉందని తెలిపారు. వ్యాపార రంగ అభివృద్ధిలో బ్యాంకింగ్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ గౌరవ అతిథిగా పాల్గొని యువ పారిశ్రామికవేత్తలకు ప్రేరణాత్మక సందేశం అందించారు. బ్యాంకు అధికారులు మాట్లాడుతూ అర్హత కలిగిన ఎంఎస్ఎంఈలకు సీజీటీఎంఎస్ఈ కింద కాలాటరల్ ఫ్రీ రుణాలు అందిస్తున్నామని తెలిపారు. వ్యాపార టర్నోవర్ ఆధారంగా జీఎస్టీ లింక్డ్ ఫైనాన్సింగ్ సదుపాయాలు కల్పిస్తున్నామని, అర్హులైన లబ్ధిదారులకు రూ.10 లక్షల వరకు ముద్ర రుణాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వస్తి వెంకటేష్, సీజీఎం. ఎం. పిచ్చయ్య, జీఎం అండ్ జోనల్ హెడ్ హైదరాబాద్ గజేంద్ర చౌహాన్, డీజీఎం అండ్ రీజినల్ హెడ్ హైదరాబాద్ దేవేంద్ర, డీజీఎం, సీఎఫ్‌బీ, ఎ.వి. రమణమూర్తి, డీజీఎం అండ్ డిప్యూటీ జోనల్ హెడ్ సి. ఎస్.ఎస్. రావు, జాయింట్ డైరెక్టర్, ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బాలానగర్, ఎ. ప్రభాకర్, కమిషనర్, టీజీఐపీసీ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## హెచ్‌ఎండిఎ పరిధిలోని చెరువులను శుభ్రపరిచి సుందరీకరణ చేయాలి : సబితా ఇంద్రారెడ్డి



చందన చెరువులో గుర్రపు డెక్కను తొలగించే పనులను ప్రారంభించిన సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, మే 16 ప్రభాతవార్త:** హెచ్‌ఎండిఎ పరిధిలో నున్న అన్ని చెరువులను శుభ్రపరిచి సుందరీకరణ చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని జిహెచ్‌ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోనున్న జిల్లెలగూడ చందన చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా హాజరైన ఆమె డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య, పలువురు మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి గుర్రపు డెక్క తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో నాటి సిఎం కెసిఆర్ సారథ్యంలో చెరువుల సుందరీకరణకు ప్రాధాన్యతనిచ్చి అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాల అవుతున్నా చెరువుల పరిరక్షణ, సుందరీకరణను విస్మరించిందని ఆమె విమర్శించారు. సర్కార్ నిర్లక్ష్యం ఫలితంగా హెచ్‌ఎండిఎ పరిధిలోని చెరువులు మురికి కూపాలుగా మారి చాలా వాటిల్లో గుర్రపు డెక్క నిండి ఉందని వెల్లడించారు. దోమల బెడదతో చెరువుల పరిసర ప్రాంతాల ప్రజలు నరకం చవి చూస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు కళ్లు తెరిచి హెచ్‌ఎండిఎ పరిధిలోని చెరువులపై దృష్టి సారించి వాటిని శుభ్రం చేయించాలని ఆమె సూచించారు. ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే విధంగా సుందరీకరించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అర్కల భూపాల్‌రెడ్డి, సిద్దాల లార్డ్స్ బీరప్ప, వి.ధనలక్ష్మి రాజ్‌కుమార్, ఎనుగుల అనిల్‌కుమార్ యాదవ్, నాయకులు అర్కల కామేష్‌రెడ్డి, సిద్దాల పెద్ద బీరప్ప, దీప్‌లాల్ చౌహాన్, బొమ్మరబోయిన యాదగిరి ముదిరాజ్, చింతపట్ల జ్ఞానేశ్వరచారి, జఠావత్ శ్రీనివాస్ నాయక్, మాదరి రమేష్, అబ్బనమోని గోపియాదవ్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జమాల్‌పూర్ సునీత బాలరాజ్, సుర్వి లత శేఖర్‌గౌడ్, సిద్దాల భరత్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## వందలాదిమంది దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటు ఎంతో అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాప్రాయం ఎంఆర్‌ఓ బైరెడ్డి రాజేష్ ,డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎన్నారెడ్డి కృష్ణారెడ్డి

**కుషాయిగూడ ,మే 16, ప్రభాతవార్త**
వందలాదిమంది దాహార్తి తీర్చేందుకు ఈసిఎల్ నడిబొడ్డున చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని కాప్ర మండల తహసిల్దార్ బైరెడ్డి రాజేష్ పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని కుషాయిగూడ పోలీస్ స్టేషన్ వద్ద కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ లైన్స్ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ కుషాయిగూడ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి డిస్టిక్ గవర్నర్ ఇన్నారెడ్డి కళ్లెం కృష్ణారెడ్డి కుషాయిగూడ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్ల తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా,సభాధ్యక్షులు లయన్స్ క్లబ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ అధ్యక్షులు, కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ అధ్యక్షులు లయన్ వడ్లోజు జ్యోతిర్మయా చారి అధ్యక్షతన ముఖ్య అతిథిగా విచ్చేసిన కాప్రా తహసిల్దార్ బైరెడ్డి రాజేష్, డిస్ట్రిక్ట్ 320 సి గవర్నర్ లయన్ ఇన్నారెడ్డి , గవర్నర్ ఎలెక్ట్ లయన్ కళ్లెం కృష్ణారెడ్డి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ బాటసారూ లతోపాటు బాధితుల దాహన్ని తీర్చడానికి ఈసీఐఎల్ పోలీస్ స్టేషన్ వద్ద జనసంద్రం ఉన్నచోట చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఇటిలైజ్ క్లబ్లో కాప్రా ప్రెస్ క్లబ్ లో ప్రతినిత్యం ఏదో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షులు, ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ అధ్యక్షులు లయన్ జ్యోతిర్మయ చారి సేవలను డిస్టిక్ గవర్నర్లు ఎన్నారెడ్డి కృష్ణారెడ్డి తహసిల్దార్లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ క్రైమ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, కుషాయిగూడ సబ్ ఇన్స్పెక్టర్ వెంకన్న, సుధాకర్ రెడ్డి, సాయిలు, శ్రీనివాస్ విజయ్ సతీష్ కాప్రా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు , లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మొదటి గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ మండా సురేష్ నాగన్న,కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శ్రీనివాస్ కోశాధికారి సురేష్ విజయ్ నర్సింగ్ గౌడ్ బాలరాజ్ రోజా రాణి ప్రసాద్వైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ సెకండ్ వైస్ డిస్టిక్ గవర్నర్ శేఖర్ రెడ్డి, కలయన్ మిట్టపల్లి విజయ్ గౌడ్ షేర్ మణమ్మ, వికలాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటేష్ పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి : కిషన్



**తుర్కయంజాల్ మే 16, ప్రభాతవార్త**
కేంద్ర బిజెపి ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం , సిఐటియు ఆధ్వర్యంలో జిహెచ్‌ఎంసి ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ పరిధిలోనీ నాగార్జున సాగర్ రహదారి బ్రాహ్మణపల్లి చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు డి కిషన్ మాట్లాడుతూ..ఇటీవల కాలంలో నాలుగు రాష్ట్రాలు ఓ కేంద్ర పాలిత ప్రాంతంలో జరిగిన ఎన్నికల ముందు వరకు ఎలాంటి ధరలను పెంచబోమని నమ్మబలికిన కేంద్ర బిజెపి ప్రభుత్వం ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ పైన మూడు రూపాయల పైచిలుకు ధరలు పెంచడం అంటే ప్రజలను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్ డీజిల్ పై పెంచిన ధరలను, ఎక్సైజ్ సుంకాలను వెంటనే తగ్గించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పడుతున్న భారాలను నివారించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని అంబానీ అదానీలకు దేశ సంపదను కట్టడపెట్టడంతో పాటు, భారత విదేశాంగ విధానాన్ని అమెరికాకు తాకట్టు పెడుతుందని, వెంటనే అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ప్రతి ధరలకు అమెరికన్ సామ్రాజ్యవాదం, దేశీయ పెట్టుబడిదారులే ప్రధాన కారణమని అన్నారు. పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం తుర్కయంజాల్ నాయకులు పి శ్రీనివాసులు, ఐతరాజ్,కృష్ణ,బడుగు మాల్యాద్రి, మద్దెల యాదయ్య, సిఐటియు నాయకులు ఆటో డ్రైవర్లు గుడ్ల వినోద్ కుమార్, గుండ బాలరాజ్,బండ బీరప్ప, శ్రీనివాస్, నాగరాజు, లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించాలి: సిపిఎం



బాలాపూర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

**సరూర్‌నగర్, మే 16 ప్రభాతవార్త:**
కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ధరల పెంపుదలకు నిరసనగా బాలాపూర్ మండల పార్టీ ఆధ్వర్యంలో బాలాపూర్ చౌరస్తాలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన పార్టీ నేతలు ప్ల కార్డులు ప్రదర్శించి ప్రధాని నరేంద్ర మోడీకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సామాన్యులకు భారంగా మారిన పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఎం నాయకుడు గోరంకల నర్సింహ, బాలాపూర్ మండల నాయకులు దాసరి బాబు, సుంకోజు యాదగిరిచారి, మీర్‌పేట్ నాయకులు దాసరి నర్సింహ, లక్ష్మారెడ్డి, వెంకయ్య, బుర్హాన్, జాపాల జంగయ్య, కొండల్, వెంకటేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ డిగ్రీ కాలేజీలో సంకల్ప్-ఫ్యూచర్‌టెక్ కార్యక్రమం



**సరూర్‌నగర్, మే 16 ప్రభాతవార్త:** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం బడంగ్‌పేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంకల్ప్-ఫ్యూచర్‌టెక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యారంగ నిపుణులు కృత్రిమ మేధస్సు విద్యా రంగంపై చూపుతున్న ప్రభావంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదే విధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వల్ల కూడా విద్యా రంగంపై కలుగుగుతున్న ప్రభావాన్ని వివరించారు. భవిష్యత్ ఉపాధి అవకాశాలు, డిజిటల్ నైపుణ్యాలపై ఆవశ్యకతను వారు తెలియజేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్, కెరీర్ గైడ్‌లైన్స్ సెల్ కో- ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.జ్యోతి లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు

### తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉపాధ్యక్షులుగా చిటికెల కృష్ణయ్య

**రామంతాపూర్, మే 16 ప్రభాతవార్త :** తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా చిటికెల కృష్ణయ్య వంశరాజ్ నియమితులైయ్యారు. శనివారం సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పిడమర్తి రవి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామంతాపూర్ వంశరాజ్ సంక్షేమ సంఘంలో జరిగిన ఉద్యమకారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమకారుల సమస్యల పరిష్కారా నికి కృషి చేయాలని కోరారు. తెలంగాణ సాధన లో ఉద్యమకారుల పాత్ర మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు నిమ్మల వీరన్న, బిఎస్ఎఫ్ సురేష్, రామంతపూర్ రజక సంఘం గౌరవ అధ్యక్షులు బొడ్డుపల్లి రవి, రామంతపూర్ వంశరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాసాని బాలస్వామి వంశరాజ్, ప్రధాన కార్యదర్శి ఇరగజీవ తిరుపతయ్య వంశరాజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాయసం గోపాల్ వంశరాజ్, ఉపాధ్యక్షులు చిన్న, కృష్ణ, వెంకటయ్య, చందు, నరసింహ, కాశన్న, వేణు, రాము, బాలు,వీరస్వామి, మల్లేష్,బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యార్థులకు ఘన సత్కారం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న చిలుక ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, మే 16 ప్రభాతవార్త:** విద్యార్థులు తమ మెదడుకు పదును పెట్టి ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీరామకృష్ణపురం డివిజన్ యాదవనగర్‌లోని శ్రీకృష్ణమందిరంలో జగిని ఎడ్యుకేషన్ ట్రస్ట్, వాసవి అన్నప్రసాద ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్షల్లో 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు శనివారం మెమెంటోలు, మెడల్స్, సర్టిఫికెట్లతో ఉపేందర్ రెడ్డి ఘనంగా సత్కరించారు. జగిని ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ జగిని రమేష్, జగిని సోమయ్య పాల్గొని విద్యార్థులను అభినందిస్తూ, వారి భవిష్యత్తుకు మరిన్ని విజయాలు చేకూరాలని, అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి అన్నప్రసాద ట్రస్ట్ చైర్మన్ పొద్దుటూరు శ్రీనివాస్, ట్రస్ట్ అడ్వైజర్ తాడేపల్లి వెంకటేశం, చిగుళ్లపల్లి లోకేష్, నవీన్‌కుమార్, మనోహర్, సుధాకర్, డాక్టర్ రామకృష్ణ, మాజేటి శ్రీనివాస్, వేముల నారాయణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## సిటి స్కాన్‌ను అందుబాటులోకి తీసుకురావాలి



మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చింతల తదితరులు.

**వనస్థలిపురం మే16,ప్రభాతవార్త**
వనస్థలిపురం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా ఆధ్వర్యంలో శనివారం వనస్థలిపురం ఏరియా హాస్పిటల్‌లో హాస్పిటల్ సూపరిటెంట్ నాగేందర్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. గత ఆరు నెలల క్రితం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి , వైద్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో సిటి స్కాన్ పరికరం మన హాస్పిటల్ కి కేటాయించడం జరిగిందని అయిన ఇప్పటిదాకా రోగులకు సిటీ స్కాన్ అందుబాటులో లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవడం జరుగుతుంది కొంతమంది కాలనీవాసులు మా దృష్టికి ఈ సమస్యను తేవడం వలన వెంటనే సిటీ స్కాన్ పరికరాన్ని గర్భిణీ స్త్రీలకు మరియు రోగులకు అందుబాటులో త్వరగా తీగా తేవాలని అవసరమైతే ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి అతి త్వరలో సిటీ స్కాన్ ని రోగులకు అందుబాటులో ఉంచాలని అధ్యక్షులు చింతల రవికుమార్ తెలిపారు. హాస్పిటల్ సూపరిడెంట్ నాగేందర్ సానుకూలంగా స్పందించి వారంలోపు సిటీ స్కాన్ పరికరాన్ని అందుబాటులో తెస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ టిఆర్ఎస్ పార్టీ నాయకులు కొలిశెట్టి సంజయ్ కుమార్ మరియు ఫేస్ ఫోర్ కాలనీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి , జనరల్ సెక్రెటరీ శ్రీధర్ రావు ,బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ అధ్యక్షులు లగోని శ్రీధర్ గౌడ్, ఉపాధ్యక్షులు ఆనంద్ రాజు , పార్దివాడ బస్తీ అధ్యక్షులు శక్తి కిషోర్ ,పరమేశ్వర్ గౌడ్ , విజయ్ ,కిషోర్ ,వంశీధర్ , ఇతర నాయకులు కాలనీవాసులు పాల్గొన్నారు.

## కులషిత నీటి సరఫరాను వెంటనే పరిష్కరించాలి : బాణాల ప్రవీణ్‌కుమార్



జలమండలి డీజీఎంకు సమస్యను వివరిస్తున్న బాణాల ప్రవీణ్ తదితరులు

**హైదరాబాద్ 15 మే, ప్రభాతవార్త :**
డాక్టర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని జింకలబావి కాలనీలో కలుషిత మంచినీటి సరఫరాలను వెంటనే పరిష్కరించాలని శనివారం రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకుడు బాణాల ప్రవీణ్‌కుమార్ జలమండలి డిజీఎంను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత అరు నెలల నుండి కలుషితమైన నీరు సరఫరా అవుతున్న జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదని అవేదన వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో లో ప్రెషర్ సమస్య తో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురైతున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం అడొద్దని, ప్రజలు అనారోగ్యానికి గైతే అ భాధ్యత జలమండలి అధికారులే వహించాల్సి ఉంటుందని అన్నారు. జలమండలి అధికారులు భాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని ఈ విషయాన్ని ఉన్నతాధితకారుల దృష్టికి తీసుకొనివెలుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ డివిజన్ అధ్యఓఉడు సిద్దు ముదిరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య ముదిరాజ్, ప్రెమ్ యాదవ్, వెంకటేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## కాల బైరవస్వామి ఆలయంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పూజలు



**ఉప్పల్, మే 16 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని శ్రీ కాల బైరవస్వామి, శ్రీ బాల అంజనేయస్వామి ఆలయంలో శని జయంతి సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కాల బైరవస్వామి ఆలయంలో పూజలు చేసి ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. అనంతరం ఉప్పల్ చౌరస్తా వద్ద శ్రీ బాలాంజనేయ స్వామి దేవాలయంలో శని జయంతి సందర్భంగా ప్రత్యేక తైలాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి పూర్ణకుంభ స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం భక్తులతో కలిసి శని దేవునికి నిర్వహించిన ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## మౌలాలి డివిజన్‌లో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలి



**మల్కాజ్‌గిరి మే 16, ప్రభాతవార్త**
మల్కాజ్‌గిరి మండల పరిధిలోని మౌలాలిలో డివిజన్ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. మౌలాలి తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ఖి ఏర్పాటు సాధనే లక్ష్యంగా జరిగిన ఈ సమావేశానికి ఎం.వి. ఫౌండేషన్ కో ఆర్డినేటర్ ఎ వి ఎమ్ స్వామి హాజరై మాట్లాడుతు..ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రుల్లో తగ్గుతున్న నమ్మకాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది.తెలంగాణ విద్యా కమిషన్ ఇచ్చిన సిఫారసులను 2026-27 విద్యా సంవత్సరం నుండే పక్కాగా అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా విడతల వారీ గా 2,000 పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా మార్చాలని ప్రతి పాఠశాలలో కనీసం 1,500 మంది విద్యార్థులు చదువుకునేలా మౌలిక వసతులు కల్పించాలి. మౌలాలిలో సుమారు 50 వేల జనాభా ఉన్నప్పటికీ, కేవలం ఒక ఉన్నత పాఠశాల, 7 ప్రాథమిక పాఠశాలలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని.జనాభా ప్రాతిపదికన ప్రభుత్వ పాఠశాలలు లేకపోవడంతో, పేద తల్లిదండ్రులు గత్యంతరం లేక ప్రైవేటు పాఠశాలలను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వినోద్, బాలలల బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ, మద్దురి దుర్గేశ్ . విజయ్ తల్లు సంఘం రాధ బాలల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ రషీద్ , రుబినా బేగం,ఎం వి ఫౌండేషన్ ఆర్గనైజర్స్ లు లావాన్య, సువర్ల , లావాన్య , సౌజన్య మొదలగువారు. పాల్గొన్నారు.

## రూ.37.5 కోట్లతో సుందరీకరణ పనులకు ఏర్పాట్లు



పనులను పరిశీలిస్తున్న సాయిజన్ శేఖర్

**నాచారం, మే 16 ప్రభాతవార్త :** హెచ్‌ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులను ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి కృషితో రూ.37.5 కోట్ల వ్యయంతో హైడ్రా ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ తెలిపారు. ఈ పనులకు ముందస్తుగా చెరువులోని నీటిని తొలగించే ప్రక్రియను అధికారులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం హెచ్‌ఎంటి నగర్ పెద్ద చెరువులోని నీటిని నేరుగా ఉప్పల్ నల్లచెరువుకు మళ్లించే పరిస్థితి లేకపోవడంతో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బాబా నగర్ ఎస్‌టీపీ నుంచి ఉప్పల్ నల్లచెరువు బయటి వరకు ఉన్న ట్రంక్ లైన్ హెచ్‌ఎంటి నగర్ రైతు బజార్ పక్కన ఉన్న నాలా మార్గంలో వెళ్తుందని వివరించారు. ఈ నేపథ్యంలో నాలాలోని ఒక మ్యాన్ హోల్‌కు రంధ్రం చేసి, పటేల్‌కుంట చెరువు నుంచి వస్తున్న మురుగునీరు హెచ్‌ఎంటి నగర్ పెద్ద చెరువులోకి చేరకుండా ట్రంక్ లైన్ ద్వారా ఉప్పల్ నల్లచెరువు బయటకు మళ్లించే పనులు ఈరోజు చేపట్టినట్లు తెలిపారు. ఈ చర్యలతో మరో వారంలో హెచ్‌ఎంటి నగర్ పెద్ద చెరువు పూర్తిగా నీటిలేకుండా ఖాళీ అవుతుందని సాయిజెన్ శేఖర్ వెల్లడించారు. చెరువు సుంద రీకరణ పనులు పూర్తయితే స్థానిక ప్రజలకు మెరుగైన వాతావ రణం, అందమైన పరిసరాలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం యాదగిరి పాల్గొన్నారు.

## బిజెపి ఓబిసి కార్యదర్శిగా బత్తుల సుమన్‌గౌడ్



సుమన్‌గౌడును సన్మానిస్తున్న నాయకులు

**ఎల్.బి.నగర్, మే 16 ప్రభాతవార్త:**
బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా చైతన్యపురి డివిజన్‌కు చెందిన బిజెపి సీనియర్ నాయకుడు బత్తుల సుమన్‌గౌడ్ నియామకమయ్యారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చంద్రరావు ఆదేశాల మేరకు బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా బత్తుల సుమన్‌గౌడును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సుమన్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ తనపై నమ్మకంతో రాష్ట్ర కార్యదర్శిగా నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నమ్మకానికి అనుగుణంగా పార్టీ నియమనిబంధనలు పాటిస్తూ క్రమశిక్షణ గల కార్యకర్తగా పార్టీ సంక్షేమం అభివృద్ధి కోసం నిబద్ధతతో పని చేస్తానని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో దేశంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజాసంక్షేమ పథకాల గురించి విస్తృత ప్రచారం చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా రాబోయే ఎన్నికలలో డబుల్ ఇంజన్ సర్కారు వచ్చే విధంగా ముమ్మర ప్రచారాన్ని చేపడతామన్నారు. క్రమశిక్షణ కలిగిన బీజేపీ సైనికుడిగా వచ్చే ఎన్నికల్లో గడప గడపకు బీజేపీ పార్టీని విజయానికి ముందు అడుగు వేస్తామన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా నియామకమైన సందర్భంగా సుమన్‌గౌడును చైతన్యపురి డివిజన్ బిజెపి నాయకులు పర్ల శివ, తిరుమల్ గౌడ్, కమల్, సత్యం, అర్జున్, భార్గవ్, ధనుష్, సందీప్, సూరజ్ తదితరులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

## ఘనంగా లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల స్నాతకోత్సవ వేడుకలు



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పాల్గొన్న బ్రదర్ అరుణ్ ప్రకాష్, బ్రదర్ జాన్ తదితరులు

**ఉప్పల్, మే 16 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల 11వ స్నాతకోత్సవ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల మాన్‌ఫోర్ట్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ రెవ. బ్రదర్ అరుణ్ ప్రకాష్, డైరెక్టర్ రెవ. బ్రదర్ జాన్, ప్రిన్సిపాల్ జయంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకకు ముఖ్యఅతిధిజగా డా.అనిల్ కుమార్, అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లాబొరేటరి అసోసియేట్ డైరెక్టర్ పాల్గొన్నారు. గౌరవ అతిథిగా ఒయు రాజకీయ శాస్త్ర విభాగానికి చెందిన విశ్రాంత ప్రొఫెసర్ జె.ఎల్.ఎన్.రావు తదితరులు హాజరయ్యారు. అనం తరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రేరణాత్మక సందేశాలు అందించారు. కళాశాల కోఆర్డినేటర్, హెచ్ఓడీలు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవం తం చేశారు. గ్రాడ్యుయేట్ విద్యార్థులు తెలుపు రంగు దుస్తుల్లో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.